
# ఎక్స్‌ప్లాయిటేషన్

ఆదూరి వెంకట సీతారామ మూర్తి

కూటికిలేని బీదవాడి జీవితం ఎంత నికృష్టంగా వుంటుందో... కాయకష్టం మీద ఏపూటకాపూటే గడిచేవాడి పూరి గుడిసె జీవితం, వాడి నిజాయితీ, అమాయకత్వం అన్నిరకాలుగానూ అందరిచేత దోపిడీకి గురయ్యే వాడి శ్రమశక్తీ- ఈ విషయాలన్నీ కథల్లో ప్రస్తావిస్తూనే - కథలోనూ కథనంలోనూ



ఉదయకిరణాలు పూర్తిగా విచ్చుకోలేదు. వీధివైపు ఆరు బయట కేన్ కుర్చీలో కూర్చొని భారతి ఇచ్చిన ఫస్ట్‌కోటా కాఫీ తాగుతూ రాత్రి పూర్తిచేసిన కథకు తుది మెరుగులుదిద్దుతున్నాను

దనాన్ని చూపిస్తూ పూర్తిచేసిన ఆ కథ బాగానే వచ్చిందనిపించింది- ఏ పోటీ కయినా పంపితే బహుమతి ఖాయమని కూడ అన్పించింది.

వీధిగేటు చప్పుడైతే అటు వంక చూశాను.

గేటవతల ఎవరో అపరిచిత వ్యక్తి నిలబడి ఉన్నాడు. మోకాళ్ళ పైకి కట్టిన మాసినపంచ, బూడిద రంగులోకి మారిన బనీను భుజాల మీద మాసిన గుడ్డతో... చూడగానే మట్టిపని చేసుకునే కూలివాడిలా కనిపించాడు.

"ఏమిటీ?" అన్నట్లు చూశాను వాడి వంక.

"ఎండుకొబ్బరి గిలకలు రెండు తీసుకుంటాను బాబూ" అన్నాడు కొబ్బరి చెట్టు వంక చేయి చూపిస్తూ.

వీధివైపు మాకు ఒక కేరళా చెన్నంగీ; ఒక గున్న మామిడీ, ఒక మేలిరకం జామిచెట్టూ ఉన్నాయి. వాటితోపాటు నాలుగు రంగుల మందారాలూ; రెండురకాల గులాబీలూ, ఒక మల్లె; ఒక పారిజాతం కూడా ఉన్నాయి.

ఏ కాలానికి తగ్గ పూలనూ కాయలనూ ఆ కాలంలో శక్త్యానుసారం ఇస్తూ ఉంటాయి. నీటి కరువువల్ల మేమే వాటి పోషణ సరిగా చూడలేక పోతున్నామని పిస్తుంది.

"అవి ప్రకృతి ధర్మానికి కట్టుబడి మాకు పూలూ కాయలూ ఇస్తున్నాయి. మేం వాటికి చేసిందేం లేకపోయినా'.." అంటుంది భారతి ఎవరైనా వాటి ప్రస్తావన తెచ్చి పొగిడినప్పుడు.

ఆ వీధంటవెళ్ళే ప్రతి ఒక్కరి దృష్టీ ఆ పూలమీదా, కాయల మీదే ఉంటుంది

స్కూలుకి వెళ్ళే ఆడపిల్లలు పువ్వులిమ్మంటే- కొందరు పెద్దవారే జామికాయలో మామిడి పిందెలో అడుగుతుంటారు.

ఇప్పుడు వీడూ - ఎండు కొబ్బరి మట్టలిమ్మనీ!

మరొకప్పుడైతే వాడితో సంభాషణకు దిగి; వాడి జీవితాన్ని తెల్సుకుని వాడికొక్కవల్సిన మట్టలు ఇచ్చేవాణ్ణేమో!

కానీ ఇప్పుడు నా చేతిలో కథ తుదిమెరుగులు దిద్దుకుంటోంది.

"ఇప్పుడు వీలవదయ్యా, నాలుగు రోజులు పోయాక కనబడు. కాయలుకూడ కొన్నిదింపి మట్టలు పట్టుకుపోదువుగాని" వాడి వైపునుండి దృష్టి మరలిస్తూ అన్నాను.

"రెండు ఎండుగిలక లివ్వండి బాబయ్యా. బొత్తిగా పొయ్యిలోకి ఏమీలేవు. ఏదేనా చిన్నాచితకా పనుంటే చెప్పండి చేస్తాను." అన్నాడు వాడుమళ్ళీ.

వాడివాలకం చూస్తే నా మూడ్ చెడగొట్టందే వెళ్ళేట్టు లేడనిపించింది.

"చెప్పేనుగదా, ఇప్పుడు కుదరదు. వెళ్ళిరా" అన్నాను వాడివంక చూడకుండానే కాస్త చిరాగ్గా.

ఈలోగా లోపల్నించి భారతి రానే వచ్చింది. వస్తూనే విషయం తెల్సుకుని, "మాకు ఏదేనా పని చేసిపెట్టడానికి మనిషి కావాలనుకున్నప్పుడు ఒక్కరూ పలకరయ్యా, అరగంట పనికి పాతికరూపాయలిస్తారా ముప్పయ్ రూపాయలిస్తారా అని బేరాలాడతారు. మీకు అవసరమైతే ఇలా బతిమిలాడతారు." అంది.

"అలాగెందుకమ్మా- ఈమాటు కేకెయ్యండి! ఏ పనున్నా నాను చెసిపెడతాను- మేం కూలిపన్లు చేసుకునే వోళ్ళమే గదా" అన్నాడువాడు-

"నిజమే, కానీ మాకవసరమున్నపుడు పలకరు ఇంతకీ నువ్వెక్కడుంటావ్?" అడిగింది భారతి.

"బీచొడ్డున మా కంట్రాక్టరు బాబుకి పనొచ్చింది. పేలసు కడతన్నాం- మా ఇల్లిదుగో... ఆ బాబుగారి మేడకి దగ్గర్లో పాకల్లో ఉంటున్నాం", అంటూ చెయ్యిచాపి కొండవైపు చూపించాడు.

"సర్లే. ఇంతకీ ఏవంటావ్" అడిగింది.

"మరేన్లేదమ్మా వంట పొయ్యి క్రిందకి పుల్లల్లేవు. ఆ రెండు ఎండుకొబ్బరి గిలకలూ ఇచ్చేరంటే-" అని ఆగి, "కాయలు దింపమంటే దింపుతాను- పనేటున్నా చెప్పండి చేత్తాను- డబ్బులేం వద్దులెండి" అన్నాడు-

ఎంచేతో భారతి కాస్త మెత్తబడ్డట్టుంది-

"సరే, తీసుకో" అంది.

గేటు తీసుకుని ఎప్పుడు లోపలి కొచ్చాడోవాడు- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందే తడవుగా పై మీదున్న గుడ్డ నడుంకి కట్టుకుని, ఉడతలా చెట్టెక్కి తనకొక్కవల్సిన ఎండుమట్టలు లాగికింద పడేశాడు.

నాకు కథ సాగడం లేదు. అంతకు ముందు వాడు మాట్లాడిన మాటలే చెవుల్లో తిరుగుతున్నాయి.

ఏం బతుకులో! రోజంతా ఆడా మగా రెక్కలు ముక్కలయ్యేట్టు కష్టపడి పని చేస్తారు. అయినా సజావుగా రోజు గడవని పరిస్థితి!

రోజుకూలి పాతికో ముప్పయ్యో రూపాయలున్నా కంట్రాక్టరు దగ్గరకుదురుకుని చేస్తే ఓ పదో అయిదో తక్కువేముడుతుంది.


అయితేనేం? పనిలేని రోజుండదు- వారానికి ఓమారు మొత్తంగా కూలి చెల్లింపులుంటాయి. ఆడమనిషి కూలి మగాడి కూలికంటె తక్కువ.

ఏమంటే ఆడకూలి అన్ని పనులకూ పనికిరాదు- రాళ్ళు కొట్టడం; తవ్వడం వంటి పన్లు చెయ్యలేదు అంటారు!

వ్యవసాయ పనులులేక పల్లెలనుంచి కూలికోసం, కూడుకోసం పట్నాలు చేరిన ఇటువంటి వారంతా ఎక్స్ప్లాయ్టేషన్‌కి గురవుతున్నారేమో ననిపించింది.

ఈ విషయాలు కూడ నా కథలో జొప్పిస్తే కథ మరింత పరిపుష్టమౌతుందన్న ఆలోచనొచ్చింది.

తనకు తెలీని విషయం గురించి, తెలీని జీవితాల గురించీ రచయిత తన రచనల్లో, చూప



కూడదని ఓ పెద్ద రచయిత అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

అయితే- తెలియని జీవితం తెలియదని ఊరుకునే కంటే ఆ విషయాలను తెల్సుకుని రాయడం మంచిదే అని మరో విమర్శకుడు చెప్పిన మాటనే నాకు అనుకూలంగా తీసుకుని ఈ కథ రాయడం మొదలు పెట్టేను-

## కూలివాడి జీవితం గురించి రాయాల్సివచ్చినప్పుడు రచయిత ఆ జీవితాన్ని అనుభవించక్కర్లేదేమో!

కూలివాడి జీవితం గురించి రాయాల్సి వచ్చినప్పుడు రచయిత ఆ జీవితాన్ని అనుభవించనక్కర్లేదేమో!

"అవిగో చూడూ- ఆ రెండూ పచ్చిమట్టలే అయినా కిందికా వాలిపోయి వచ్చేపోయేవారి తలలకు రాసుకుంటున్నాయి- కత్తి ఇస్తాను, కాస్త కొట్టెయ్" అంటోంది భారతి.

"అయా ఒద్దండమ్మగోరూ- అయుంటే సెట్టుకీ గెలకీకూడా బలం! అలాగే ఉణ్ణీండి" అంటున్నాడు వాడు.

వాటి గురించి వాడికంటె తన కెక్కువ తెలీదనుకుందేమో మరి... భారతి మరేం మాట్లాడలేదు.

"పోనీ బొండాల్లో ముదురు వేమైనా వున్నాయేమో చూడు. ఓ నాలుగు దింపుదూగానీ- డబ్బులు అక్కర్లేకుండా ఏ పనైనా చేస్తానన్నాడని కాబోలు... వాడిచేత ఆ పనైనా చేయించాలని భారతి ఉద్దేశం!

"ముదురువేం లేవండమ్మగోరూ. మరో పది రోజులు పోనివ్వండి" అంటున్నాడువాడు.

ఎండుమట్టలూ, గిలకలూ కిందపడేసి దిగిపోయాడు.

"మళ్ళాదివారం వస్తానండమ్మగోరూ. ఈ మొక్కలన్నిటికీ పాదులు దీసి, కొబ్బరి కాయలు దింపేత్తాను." అన్నాడు.

భారతి ముఖంలో సంతోషం చూడాలి! సరైన పనివాడు దొరక్కా; తను చేసుకోలేకా; మొక్కల సంరక్షణ చూడలేక పోతోంది.

"అలాగే. మర్చిపోకుండారా." అనిచెప్తూ, "ఇదిగో చూడూ, బొండాం ఒలిచిన ఎండు డిప్పలుకూడ పెరట్లో బొప్పాయి చెట్టు మొదట్లో ఉన్నాయి. కావలిస్తే అవికూడ కొన్ని తీసుకువెళ్ళు" అంది.

"అలాగేనండి" అంటూ వెళ్ళి; "ఏమలు పట్టేన్నాయండమ్మగోరూ. అన్నీ తీసేస్తా. సుబ్బరంగ ఉంటాది" అన్నాడు.

"మా పని మనిషి పొయ్యిలోకి కావాలని వుంచుకుంది. పోన్లే తీసుకెళ్ళు" అంది భారతి పెరడు శుభ్ర పడుతుందన్న ఉద్దేశంతో-

అన్నిట్నీ తన పైగుడ్డలో వేసి, ఓ పెద్ద మూట తయారుచేశాడు. ఎండుమట్టల్ని కూడా వేరేగా ఓ తాడుతో కట్టాడు.

అప్పుడు గుర్తొచ్చింది నాకు వాడిచేత చేయించాల్సిన అసలుపని-

ఎదురింటాయన ఇల్లు మరమ్మత్తులు చేయించి ఇటుక ముక్కల్నీ, రాళ్ళనీ; పనికిరాని మట్టినీ ఇసకనీ, మా ఇంటివైపు పోయించి, మరమ్మత్తులు పూర్తయినా వాటిని ఎత్తించకుండానే ఇల్లు అద్దె కిచ్చేసి, కొడుకు దగ్గరకి విజయవాడ వెళ్ళిపోయేడు-

మున్సిపాలిటీ పనివారితో చెపితే అవి ఎత్తడం తమ పని కాదన్నారు. చెత్తలెత్తే లారీవాడు కూడ పాతికిస్తే ఆలోచిస్తానన్నాడు.

ఏమైతేనేం సుమారు ఆరునెలలుగా అది మా ఇంటి ముంగిట్లో అసహ్యంగా ఉంది.

దాన్నికాస్త పారతో మాగుమ్మంముందు లేకుండా పక్కకి తీయించి ఓ అయిదు రూపాయలు చేతిలో పెడితే వాడూ సంతోషిస్తాడు. మాకూ బాగుంటుంది అన్పించింది-

కథ కాగితాల్ని పక్కకు సర్దిలేచాను.

"ఇదిగో... నీ పేరేంటన్నావ్"

"సోవులండీ"

"మీ కుటుంబం ఎందరేంటి?"

"ఇక్కడ నేనూ మా ఆడదీ; ఓ సంటి పిల్లానండి."

"వీటితో మీకు నాలుగు రోజులు పొయ్యిలోకి ఢోకా ఉండదనుకుంటాను. అవునా?" అన్నాను.

"మీలాంటి బాబూలదయుంటే మాకేటిబాబూ" అన్నాడు వాడు.

"చూడు సోములూ నువ్వో చిన్నపని చేసి పెట్టాలోయ్"

"ఏటి సెప్పండి బాబూ"

పీధి గుమ్మంలోకి తీసుకెళ్ళి వివరంగా చెప్పేను.

"పారయిస్తాను- ఆ మట్టీ రాళ్ళూ కాస్త పక్కకి లాగేస్తే చాలు."

"అంతేగదా, చేస్తానుబాబూ, అదో పనా?" అన్నాడు తలెగరేసి.

"రోజూ ఇబ్బంది పడుతున్నా నాకా ఆలోచనే రాలేదు సుమండీ" అంది భారతి నావంక ఆశ్చర్యానందాల్తో చూస్తూ.

వెనకగదిలో అటకమీదున్న పారకోసం వెళ్ళి వచ్చేనరికి భారతి ఏదో పొట్లాం కట్టి వాడి కందిస్తోంది. నన్ను చూసి, "ఏదో... నంజుకి కావాలంటేనూ... పాత ఆవకాయ ఇచ్చేను." అంది- ఇక వీడి అదృష్టం పండింది అనుకున్నాను.

"పార ఇక్కడే ఉంచండమ్మా, ఇవి కాస్త ఇంటికాడ కిచ్చేసొస్తాను - మా ఆడది పొయ్యిలోకి లేక అగ్గి రాజెయ్యకుండా కూర్చునుంది. పిల్లదాయి బువ్వకోసం ఏడుస్తా ఉన్నాది." అన్నాడు.

వాడి స్థితికి జాలేసింది.

పొద్దున్నే వంటగేస్ అయిపోతే అటు స్పేర్ సిలెండరూ లేక ఇటు స్టవ్‌లోకి కిరసనాయిలూ దొరక్క తను పడే బాధ భారతి మదిలో మెదిలినట్టుంది.

"సరే ఇచ్చేసి తొరగా రా," అంది.

"అలాగేనమ్మా. చనంలోరానూ" అంటూ తలమీద మోపూ, భుజంమీద మూటా ఉంచుకుని భారంగా కదిలేడు.

కథను మళ్ళీ చేతిలోకి తీసుకుని శ్రమజీవి దైనందిక దయనీయ జీవితాన్ని మరింత పకడ్బందీగా రాయాలనే ప్రయత్నంలో పడ్డాను నేను.

ఎటూ ఆదివారంకదా! ఇంటిముందు శుభ్రం చేయిస్తే ఎంచక్కా పనిమనిషి చేత పేడ కల్లాపి చిక్కగా చల్లించి పెద్దముగ్గు పెట్టాలని మెట్లమీద కూర్చుని వాడికోసం ఎదురు చూస్తోంది భారతి.

**అరగంట గడిచింది-**

**గంట గడిచింది సోములు వెళ్ళి.**

**రోజులు కూడా గడిచాయి.**

**భారతి ఎదురు చూస్తూనే ఉంది, ఏదో గుడ్డినమ్మకంతో...**

నా కథ పూర్తయి, 'పేదవాడి బ్రతుకు' పేరిట అందంగా అచ్చులోకి కూడా వచ్చేసింది!